


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

## పాము విషానికి విరుగుడు.. ఒంటె కన్నీరు!



ఒంటె కన్నీటిలోని రసాయనాలు పాము విషానికి విరుగుడుగా పనికొస్తాయని శాస్త్రవేత్తలు చేసిన పలు పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఈ నేపథ్యంలో ఒంటె కన్నీటితో పాము విషాన్ని తొలగించగల ఔషధాన్ని తయారు చేసే ప్రయత్నాలు వేగంగా సాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పాము కాటు కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 1.25 లక్షల మంది మరణిస్తున్నారు. కొన్ని పాములు అత్యంత విషపూరితమైనవి. ఇవి కాటువేసినప్పుడు మనిషి బతికేందుకు అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో పాము విషానికి విరుగుడుగా పనికి వచ్చే ఔషధాల తయారీకి నిరంతరం పలు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## ఏపీలో కాంగ్రెస్ జోరు..
### సీఎం జగన్ అలర్ట్!



వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టిన తర్వాత అధికార వైసీపీలో అలజడి మొదలైంది. రానున్న ఎన్నికల్లో వైసీపీ, బీజేపీ కూటమికి వ్యతిరేకంగా అన్ని పార్టీలను కలుపుకొని వెళ్లాలని షర్మిల భావిస్తోంది. దాంతో వైసీపీ, బీజేపీ, జనసేన నుంచి కాంగ్రెస్‌కు భారీగా వలసలుంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దాంతో సీఎం జగన్ అలర్ట్ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరిన కీలక నేతలను వెనక్కి రప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

## కుదిరిన డీల్.. పాక్ ప్రధానిగా షెహబాజ్, అధ్యక్షుడిగా జర్దారి



పాకిస్థాన్‌లో ఏర్పడిన రాజకీయ అనిశ్చితికి తెరపడింది. వారం రోజుల హై టెన్షన్‌కు.. రెండు పార్టీలు ఫుల్‌స్టాప్ పెట్టేశాయి. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో పీపీపీ, పీఎంఎల్-ఎన్ మధ్య ఒప్పందం కుదిరింది. మంగళవారం అర్ధరాత్రి ఇస్లామాబాద్‌లోని జర్దారి ఇంట్లో మీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చైర్మెన్ బిలావాల్ భుట్టో జర్దారి కీలక ప్రటకన చేశారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్(పీఎంఎల్-ఎన్) పార్టీ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పీఎంఎల్-ఎన్, పీపీపీ వద్ద కావాల్సినంత సభ్యులు ఉన్నట్లు భుట్టో తెలిపారు. దేశ అధ్యక్ష బాధ్యతలను అసిఫ్ అలీ జర్దారి చేపట్టనున్నారు. జాతీయ అసెంబ్లీలో స్పీకర్ పోస్టు పీఎంఎల్-ఎన్ పార్టీకి దక్కనున్నది. ఇక డిప్యూటీ స్పీకర్ పదవి పీపీపీకి వెళ్లనున్నది. సేనేట్‌లో చైర్మెన్ పదవి పీపీపీ ఖాతాలో వెళ్లనున్నది. డిప్యూటీ చైర్మెన్ పదవి నవాజ్ లీగ్‌కు దక్కనున్నది.

## బిహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..
## 9 మంది మృతి!



బిహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టెంపోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బుధవారం తెల్లవారుజామున రామ్‌గఢ్ చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లఖిసరాయ్ సమీపంలోని ఝూల్నా గ్రామం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న టెంపోను రాంగ్ సైడ్ నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ టెంపో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. టెంపోలో ప్రయాణిస్తున్న వారందరూ సికంద్రాలో క్యాటరింగ్ పని ముగించుకుని.. ఇంటికి వెళ్లేందుకు లఖిసరాయ్ రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. ఇంతలో ఎన్‌హెచ్ 30పై వేగంగా వచ్చిన లారీ.. టెంపోను ఢీకొట్టింది. మృతుల బంధువులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బంధువులు వచ్చిన తర్వాత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించనున్నారు.

## విశ్వంభరలో సుర్భి పురానిక్?

[redacted]

యువి క్రియేషన్స్ సంస్థ గ్రాండ్ లెవల్లో నిర్మిస్తున్న విశ్వంభరకు కీరవాణి సంగీతం అందిస్తుండగా చోటా కె నాయుడు ఫోటోగ్రఫి అందిస్తున్నారు. ఇక ఈ మూవీని అన్ని కార్యక్రమాలు ముగించి వచ్చే ఏడాది సంక్రాంతికి ఆడియన్స్ ముందుకి తీసుకురానున్నారు.




# మళ్లీ మొదలుకానున్న ఢిల్లీ చలో నిరసన
## 14వేల మంది రైతులు..1200 ట్రాక్టర్లు సిద్ధం



...ంటకు కనీస మద్దతు ధర అంశంలో కేంద్రం ...తిపాదనను తిరస్కరించిన రైతులు.. 'ఢిల్లీ ...లో' పేరిట తమ నిరసనను నేడు తిరిగి ప్రారం...చనున్నారు. ప్రస్తుతం పంజాబ్, హరియాణా ...ధ్య ఉన్న శంభు సరిహద్దు వద్ద వారు ఢిల్లీ ...కగా కదలనున్నారు. దాంతో దేశ రాజధానిలో ...లీసులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ వైపు ...ళ్లేందుకు శంభు వద్ద 14వేల మంది రైతులు, ...200 ట్రాక్టర్లు, 300 కార్లు, 10 మినీ బస్సులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అలాగే బారికేడ్లను ధ్వంసం చేసే పరికరాలను వారు తమ వెంట తీసుకెళ్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకోవాలని హరియాణా పోలీసులు.. పంజాబ్ బలగాలను అభ్యర్థించారు. మరోపక్క ఢిల్లీలోకి ప్రవేశించే మార్గాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉంటే.. కనీస మద్దతు ధరపై చట్టం తీసుకువచ్చేందుకు కేంద్రం ఒకరోజు పార్లమెంట్‌ను సమావేశపర్చాలని రైతు నాయకుడు శర్వాన్ సింగ్ పంథేర్ కోరారు. తమ మార్చ్‌ను అడ్డుకునేందుకు హరియాణాలోని సరిహద్దు గ్రామాల్లో పారామిలిటరీ బలగాలను మోహరించారని ఆరోపించారు. 'మేం చేసిన నేరం ఏమిటి..? మిమ్మల్ని ప్రధానిని చేశాం. మమ్మల్ని అణచివేసేందుకు ఈ విధంగా బలగాలను ఉపయోగిస్తారని అనుకోలేదు. మేము అసలు డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గేలా కేంద్రం ప్రతిపాదనలు చేసింది. ఇప్పుడు ఏం జరిగినా దానికి కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని పంథేర్ హెచ్చరించారు. ఈ పరిణామాలపై కేంద్ర హోం శాఖ పంజాబ్ ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఆందోళనకారుల్లో కొందరు శంభు వద్దకు బుల్డోజర్లు, ఎర్త్ మూవర్స్ వంటివి తీసుకువచ్చారని వెల్లడించింది. భారీ మెషినరీని, ట్రాక్టర్లను ఆపరేట్ చేసే వ్యక్తులకు టియర్ గ్యాస్ ,రబ్బర్ బుల్లెట్ల నుంచి నుంచి రక్షణ కల్పించేలా క్యాబిన్లకు ఐరన్ షీట్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.


**'ఢిల్లీ చలో' శాంతియుతంగానే చేస్తాం: రైతు నేత**

భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో పంజాబ్, హరియాణా సరిహద్దుల్లో నిలిచిపోయిన తాము శాంతియుతంగానే ఢిల్లీ వైపు కవాతు చేస్తామని రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్ బుధవారం తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం తమ లక్ష్యం కాదని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం సహా పలు డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న రైతులు.. కేంద్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. అన్నదాతల డిమాండ్లపై భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం కాలయాపన చేస్తోందని డల్లేవాల్ ఆరోపించారు. దేశ రాజధానిలోకి ప్రవేశించకుండా సరిహద్దుల్లో రక్షణ వలయాలు ఏర్పాటు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వమే వాటి తొలగింపునకు ఆదేశాలిచ్చి.. తమను నగరంలోకి ప్రవేశించేందుకు అనుమతించాలన్నారు. నిరసన తెలియజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. కనీస మద్దతు ధరపై చట్టం విషయంలో కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని తప్పుబట్టారు. మరోవైపు ఈరోజు డెడ్‌లైన్ ముగిసిన తర్వాత ఢిల్లీ వైపు తమ ప్రయాణం కొనసాగిస్తామని రైతు నాయకులు వెల్లడించిన నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. టిక్రీ, సింఘు, గాజీపూర్ సరిహద్దుపై గట్టి నిఘా ఉంచారు.



## ప్రముఖ న్యాయవాది ఫాలీ నారీమన్ కన్నుమూత

ప్రముఖ న్యాయవాది ఫాలీ ఎస్ నారీమన్ ఇకలేరు. వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో ఆయన ఇవాళ (బుధవారం) ఉదయం కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయస్సు 95 సంవత్సరాలు. ఫాలీ నారీమన్ సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది. 1991 నుంచి 2010 వరకు ఆయన బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా పనిచేశారు. న్యాయవాద వృత్తిలో ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1991లో పద్మభూషణ్, 2007లో పద్మవిభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. అదేవిధంగా 1999 నుంచి 2005 వరకు నారీమన్ రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు.



## ఈనెల 24న
## తెలంగాణకు అమిత్ షా

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈనెల 24న తెలంగాణకు రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొననున్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు ప్రకటించారు. ఆయన రాకకు సంబంధించి బీజేపీ అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి దిశానిర్దేశం చేయనున్నారు. గతేడాది డిసెంబర్ 28న తెలంగాణకు వచ్చిన అమిత్ షా .. తెలంగాణలో 10 ఎంపీ స్థానాలు గెలిచి 35 శాతం ఓట్లు సాధించాలని స్థానిక నాయకత్వానికి అమిత్ షా టార్గెట్ ఇచ్చారు. లోక్ సభ ఎన్నికల వేళ పార్టీ ముఖ్య నేతలంతా ఐక్యంగా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.

## ఉగ్రవాది పన్నున్ బెదిరింపు..
## ఇంగ్లండ్-ఇండియా టెస్టుకు భద్రత పెంపు

అమెరికా ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నున్ వార్నింగ్ నేపథ్యంలో ఇంగ్లండ్, ఇండియా మధ్య రాంచీలో జరగనున్న నాలుగో టెస్టు మ్యాచ్‌కు భారీ భద్రతను పెంచారు. రాంచీ టెస్టును చెదరగొట్టేందుకు ఆ ఉగ్రవాది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాంచీలో భారీ సంఖ్యలో భద్రతను పెంచారు. పన్నున్‌ను ఉగ్రవాదిగా ప్రకటిస్తూ ఇటీవల కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్, భారత్ మధ్య జరిగే టెస్టు మ్యాచ్‌ను అడ్డుకోవాలని అతను సోషల్ మీడియాలో ఓ వీడియోలో అప్‌లోడ్ చేశాడు. మ్యాచ్‌ను అడ్డుకోవాలంటూ ఆయన సీపీఐ దళాన్ని కోరారు. ఈనెల 23వ తేదీ నుంచి నాలుగో టెస్టు మ్యాచ్ జేఎస్సీఏ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో జరగనున్నది. మంగళవారమే ఇంగ్లండ్ జట్టు రాంచీ చేరుకున్నది.ఉగ్రవాది పన్నున్‌పై దుర్వా పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐటీ చట్టం ప్రకారం ఆ ఫిర్యాదు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించినట్లు హతియా డీఎస్పీ పీకే మిశ్రా తెలిపారు. ఉగ్రవాది పన్నున్ పై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ 2019 నుంచి నిఘా పెట్టింది. అమెరికాలో ఉంటూ పంజాబ్‌లో బీభత్సం సృష్టిస్తున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. పన్నున్‌కు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేశారు. 2021, ఫిబ్రవరి 3వ తేదీన ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఆ వారెంట్ ఇచ్చింది. గత ఏడాది నవంబర్ 29వ తేదీన అతన్ని నేరస్థుడిగా కూడా ప్రకటించారు.





## స్వల్ప లాభాల్లో దేశీయ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు ఉన్నాయి. ఉదయం 9:19 గంటల సమయంలో సెన్సెక్స్ 59 పాయింట్లు లాభపడి 73,116 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 18 పాయింట్లు పెరిగి 22,215 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.91 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎం అండ్ ఎం, టాటా స్టీల్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, టైటన్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.





## రాజ్యసభకు సోనియా, నడ్డా..
# మొత్తం 41 మంది ఏకగ్రీవం

దాదాపు 25 ఏండ్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తాజాగా రాజ్యసభలో అడుగుపెట్టబోతున్నారు. రాజస్థాన్ నుంచి ఆమె పెద్దలసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. గుజరాత్ నుంచి ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల తరఫున ఖాళీ అయిన 56 రాజ్యసభ స్థానాలకు గాను 41 చోట్ల ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నికయ్యారు. మిగిలిన చోట్ల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ఎన్నిక జరుగనున్నది.ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్ మురగన్ తదితరులు ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్‌లోని ఖాళీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. అత్యధికంగా బీజేపీ 20 స్థానాలు, కాంగ్రెస్ 6 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్ 4, వైఎస్సార్ కాంగ్రెస్ 3, ఆర్జేడీ 2, బీజేడీ 2, ఎన్సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ) చెరొక స్థానాన్ని ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. 41 స్థానాల్లో ఇతర అభ్యర్థులెవరూ పోటీ లేకపోవటంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక రిటర్నింగ్ అధికారులు వారిని విజేతలుగా ప్రకటించారు. 56 ఖాళీలకు గాను 50 చోట్ల సభ్యులు ఏప్రిల్ 2న పదవీ విరమణ చేయనుండగా.. మరో ఆరుగురు ఏప్రిల్ 3న పదవీ విరమణ చేయనున్నారు. యూపీలో 10, కర్ణాటకలో 4, హిమాచల్‌లో ఒక స్థానానికి ఎన్నిక జరగాల్సి ఉన్నది.



## రాహుల్ యాత్రకు ఐదు రోజులపాటు బ్రేక్

కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు బ్రేక్ పడింది. రాహుల్ గాంధీ పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్న నేపథ్యంలో యాత్రకు ఐదు రోజుల పాటు విరామం ప్రకటించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ బుధవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఫిబ్రవరి 26వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకూ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ బ్రిటన్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. దీంతోపాటు దేశంలో త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీలో పలు ముఖ్య సమావేశాల్లో కూడా రాహుల్ పాల్గొనాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే యాత్రకు ఐదు రోజుల పాటు తాత్కాలిక బ్రేక్ ఇచ్చినట్లు తెలిపారు. యాత్రను మార్చి 2వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ధోల్‌పూర్‌లో తిరిగి పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. ఇక మార్చి 5వ తేదీన ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయాన్ని రాహుల్ సందర్శిస్తారని జైరాం రమేశ్ ఈ సందర్భంగా తెలిపారు.



## చిత్తూరు జిల్లాపై
# నెల్లూరు బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

సంక్షోభంలో కోళ్ల పరిశ్రమ..

చిత్తూరు జిల్లాపై నెల్లూరుజిల్లా బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ పడింది. దీంతో నెల్లూరు జిల్లాకు పక్కనే ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పౌల్ట్రీ ఉత్పత్తులు, ఎగుమతుల సంక్షోభానికి కారణం అయ్యింది. దీంతో జిల్లాలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగంపై ఆధారపడ్డ రైతాంగం లబోదిబోమంటోంది. వారం క్రితం నెల్లూరు జిల్లా పొదలకూరు ప్రాంతంలో బయట పడ్డ బర్డ్ ఫ్లూ ఇప్పడు చిత్తూరు జిల్లా పౌల్ట్రీ బిజినెస్ ను కుంగదీసింది. రోజువారీగా బెంగళూరు పాండిచ్చేరి, చెన్నైలకు కోళ్లు, కోడిగుడ్లు ఎగుమతులు చేస్తున్న చిత్తూరు జిల్లాలోని హేచరీస్ సంస్థలు ఎగుమతులు లేక తీవ్రంగా నష్టపోతున్నాయి. జిల్లా లోని పౌల్ట్రీ ఉత్పత్తులను అనుమతించని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల తీరు ఇబ్బందిగా మారింది. దీంతో బార్డర్ చెక్ పోస్టుల వద్దనే పౌల్ట్రీ రంగం ఉత్పత్తులను రవాణా చేస్తున్న వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏడాదికి 10 లక్షల ఫారం కోళ్లు,7 లక్షల పెరటి కోళ్లు పెంపకం జరుగుతుండగా.. ఏటా రూ. 800 కోట్ల మేర పౌల్ట్రీ బిజినెస్ జరుగుతోంది. ఏడాదికి 37, 089 మెట్రిక్ టన్నుల కోళ్లు, 10.73 లక్షల కోడి గుడ్లను హేచరీస్ సంస్థలు, రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. సరాసరి రోజువారీగా రూ. 5 కోట్ల వ్యాపారం చేస్తున్నారు. తాజాగా.. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో.. ఫౌల్ట్రీ వాహనాలను చెక్‌పోస్టుల దగ్గర అధికారులు నిలిపివేస్తుండటంతో.. రోజుకి రూ.5కోట్ల వ్యాపారం ఆగిపోతోందంటూ ఫౌల్ట్రీ రైతుల ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చిత్తూరు జిల్లా యంత్రాంగం కూడా అలెర్ట్ అయ్యింది. చిత్తూరు జిల్లాలో 31 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసింది. జిల్లాలో పిపిఈ కిట్లు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచింది. దాదాపు జిల్లాలో 8 వేల మంది రైతులు పౌల్ట్రీ రంగంపై ఆధారపడినట్లు చెబుతున్న అధికార యంత్రాంగం.. నెల్లూరు జిల్లా నుంచి కోళ్ల ఎగుమతులను నిషేధించింది. చికిత్స, టీకా లేని బర్డ్ ఫ్లూ ను కేవలం నివారించడం ఒక్కటే మార్గం అంటోంది. పశువైద్య సిబ్బంది ద్వారా జిల్లా యంత్రాంగం ప్రజల్లో బర్డ్ ఫ్లూ పై అవగాహన కల్పిస్తోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా అలెర్ట్ గా ఉన్నామంటున్నారు చిత్తూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని జిల్లా ప్రజలు భయపడాల్సిన పని లేదంటున్నారు. అయితే తగిన జాగ్రత్తలు తీసుకొని కోడి మాంసం కోడిగుడ్లు వినియోగించాలంటున్నారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.



## కొవిడ్ టీకాతో గడ్డ కడుతున్న రక్తం..
# తేల్చిన తాజా అధ్యయనం..!

కొవిడ్-19 వ్యాక్సినేషన్ తర్వాత వివిధ దేశాల్లో (భారత్ మినహా) టీకా తీసుకున్న వారిలో గుండె సమస్యలు, మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వంటి దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. కొవిడ్-19 టీకా దుష్ప్రభావాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌వో), యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కీలక డాటా సేకరించింది. ద గ్లోబల్ కొవిడ్ సేఫ్టీ ప్రాజెక్ట్.. పేరుతో కొవిడ్ టీకాల పనితీరును మదింపు చేసింది. భారత్ మినహా వివిధ దేశాల్లో 9.9 కోట్లమంది పేషెంట్ల నుంచి డాటాను సేకరించి ఈ నివేదికను రూపొందించినట్టు తెలిసింది. ఎంఆర్ఎన్ఏ కొవిడ్ టీకాలు తీసుకున్నవారిలో గుండె సమస్యలు, మెదడు రక్తనాళాల్లో గడ్డకట్టడం వంటివి 1.5 రెట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి.



## ప్రసాదం తిన్న 500ల మందికి అస్వస్థత

మహారాష్ట్ర బుల్దానా జిల్లా లోనార్ తాలూకా సోమ్‌థామ్‌థానా గ్రామంలో మంగళవారం అనూహ్య ఘటన జరిగింది. ఏకాదశి సందర్భంగా గ్రామంలో ధార్మిక కార్యక్రమం నిర్వహించారు. అక్కడ పంచిన ప్రసాదం తిన్న తర్వాత భక్తులకు ఫుడ్ పాయిజన్ అయింది. 500ల మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. లోనార్, మెహకర్, సింద్‌ఖేడ్ రాజాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో బాధితులు చికిత్స పొందుతున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

## దుబాయ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఐదుగురు తెలంగాణ వాసులకు విముక్తి

దుబాయ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఐదుగురు తెలంగాణ వాసులకు విముక్తి లభించింది. ఓ హత్యకేసులో 18ఏళ్లుగా వీరు జైలు శిక్ష అనుభవిస్తున్నారు. నేపాల్‌కు చెందిన వాచ్‌మెన్ బహదూర్ సింగ్ హత్య కేసులో వీరికి తొలుత పదేళ్ల శిక్ష పడింది. ఆ తర్వాత దుబాయ్ కోర్టు శిక్షను 25 ఏళ్లకు పెంచింది. మాజీ మంత్రి కేటీఆర్ నేపాల్ వెళ్లి .. హతుని కుటుంబ సభ్యులకు రూ.15 లక్షలు పరిహారం స్వయంగా చెల్లించి క్షమాభిక్ష పత్రం రాయించినా.. మారిన నిబంధనలతో కోర్టు అంగీకరించలేదు. అనారోగ్య కారణాలు చూపుతూ నిందితుల తరపు న్యాయవాదులు మరోసారి ప్రయత్నించారు. దీనికి అంగీకరించిన దుబాయి కోర్టు ఏడేళ్లు ముందే వారిని విడుదల చేసింది. దీంతో దుబాయ్ నుంచి సిరిసిల్ల ,రుద్రంగి, కొనరావుపేట మండలానికి చెందిన ఐదుగురు హైదరాబాద్ వచ్చారు. 18ఏళ్ల తర్వాత కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భావోద్వేగ వాతావరణం నెలకొంది.





## 'కన్నప్ప' లో పార్వతి దేవిగా
# కంగనా?

[redacted] స్తుండగా కీలక పాత్రల్లో మోహన్ బాబు, శివరాజ్ కుమార్, రాధికా, బ్రహ్మానందం, శరత్ కుమార్ తదితరులు నటిస్తున్నారు. ప్రస్తుతం వేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీలో ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్న శివ పార్వతుల పాత్రల్లో పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్, లేడీ సూపర్ స్టార్ నయనతార నటించనున్నారని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే లేటెస్ట్ టాలీవుడ్ అప్ డేట్ ప్రకారం శివుని గా ప్రభాస్ నటించనుండగా పార్వతి దేవి పాత్రలో బాలీవుడ్ నటి కంగనా రనావత్ నటించనున్నట్లు చెప్తున్నారు. త్వరలోనే ఈ మూవీ గురించిన మరిన్ని వివరాలు అధికారికంగా వెల్లడి కానున్నాయట. ఏ వి ఏ ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంస్థలు కన్నప్ప మూవీని గ్రాండ్ లెవెల్లో నిర్మిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ మూవీ ఆడియన్స్ ముందుకి వచ్చే అవకాశం ఉంది.

## [redacted] రెడ్డి.. నీకు దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడు..

[redacted]పీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర [redacted]చుకుపడ్డారు. "కిషన్ రెడ్డి.. నీకు దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ [redacted] అంటూ సవాల్ విసిరారు. బుధవారం మీడియాతో [redacted].. బీజేపీని వ్యతిరేకించిన అందరినీ జైలుకు పంపారని.. మరి [redacted]బంపై చర్చలేవి అని ప్రశ్నించారు. బీజేపీ - బీఆర్ఎస్ దోస్తీ [redacted]సన్నారు. కిషన్ రెడ్డికి పదవి ఇప్పించింది కేసీఆరే అని అన్నారు. [redacted]నామినేటెడ్ బై కేసీఆర్ అంటున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. [redacted]ల్లో ప్రభుత్వాలను కూల్చినట్టు తెలంగాణలో కుదరదన్నారు. [redacted]ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నది తమకు తెలుసన్నారు. [redacted]న్నికలకు ముందే ఏదో చేయబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అనుమానం వ్యక్తం చేశారు.






## డీఎస్సీ పై హైకోర్టు కీలక ఆదేశాలు

డీఎస్సీపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎస్‌జీటీ పోస్టుల పరీక్షకు బీఈడీ అభ్యర్థులను అనుమతించబోమంటూ కోర్టు ముందు ప్రభుత్వం తన వాదనను వినిపించింది. దీంతో విచారణను ఎనిమిది వారాల పాటు విచారణ వాయిదా వేస్తూ ఏపీ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. ఎస్టీజీ పోస్టుల భర్తీలో బీఈడీ అభ్యర్థులను అనుమంతిచే విషయంలో హైకోర్టు స్టే విధించింది.

స్టే ఉత్తర్వులు ఇస్తూ...ఇటీవల ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇందులో బీఈడీ అభ్యర్థులు కూడా ఎస్‌జీటీ పోస్టులకు అర్హులేనని ప్రకటించడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను ఎలా అనుమతిస్తారంటూ కొందరు పిటీషన్ వేయడంతో దీనిపై విచారించిన హైకోర్టు దానిపై స్టే విధించింది.

## అలాంటి వాటికి మేం వ్యతిరేకం: పుతిన్

అంతరిక్షంలోకి అణ్వాయుధాలను పంపేందుకు తాము పూర్తి వ్యతిరేకమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. అంతరిక్ష ఆధారిత యాంటీ శాటిలైట్ ఆయుధాలను రష్యా అభివృద్ధి చేస్తోందంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఖండించారు. అంతరిక్షంలోకి అణ్వాయుధాలను పంపడాన్ని రష్యా ఎప్పటికీ సమర్థించబోదని అన్నారు. అంతరిక్ష రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు తమతో కలిసి నడవాలని పాశ్చాత్యదేశాలను ఇప్పటికే పలుమార్లు ఆహ్వానించామని చెప్పారు.

